క్లుప్తంగా

జోరుగా వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ



దయాలసిస్ బాధితునికి పింఛన్ అందిస్తున్న జెడ్పీటీసీ భవానీరంగ, సునీతామాన్‌సింగ్

భీమడోలు: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ జోరుగా సాగింది. తొలిరోజు సోమవారం భీమడోలు మండలంలోని 17 గ్రామ సచివాలయాల పరిధిలోని 8,785 మందిలో 7579 మందికి పింఛన్ సొమ్ము అందించారు. దీంతో పంపిణీ 86.27 శాతం నమోదైంది. భీమడోలులో సోమవారం దయాలసిస్ బాధితునికి మంజూరైన కొత్త పింఛన్ రూ.10 వేలు జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీరంగ, జిల్లా చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు డాక్టర్ పాము సునీతామాన్‌సింగ్, ఎంపీటీసీ ఆల్తి గోపిలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పింఛన్‌దారుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రతి నెల ఒకటవ తేదీనే పింఛన్ సొమ్మును గడపగడపకు వచ్చి లబ్ధిదారునికి నేరుగా అందిస్తోన్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. ప్రజలంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును నిండైన మనస్సుతో ఆశీర్విదించాలని కోరారు. వార్డు సభ్యులు, నాయకులు, వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగన్‌కు విశేష స్పందన



కోరుకొల్లులో పథకాలను వివరిస్తున్న పార్టీ నాయకులు, కన్వీనర్లు, గృహసారథులు

భీమడోలు: జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం హుషారుగా సాగుతోంది. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాలపై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఇప్పటికే గ్రామాల్లో 80 శాతం సర్వే పూర్తయింది. కొల్లేరు గ్రామం కోరుకొల్లు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దాట్ల వెంకట సుబ్బరాజు ఆధ్వర్యంలో సోమవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిను రెండో సారి సీఎం చేస్తామని, మా అందరికీ సంక్షేమ పథకాలను అందిస్తోన్న జగన్‌కు ఎప్పుడూ అండగా ఉంటామని లబ్ధిదారులు పేర్కొన్నారని నాయకులు తెలిపారు. లబ్ధిదారులు తమ ఇళ్లకు స్టిక్కర్లు స్వచ్ఛందంగా అతికించుకున్నట్టు చెప్పారు. మంతెన పుల్లంరాజు, వేములమంద రామరాజు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

కాలభైరవి అమ్మవారి తిరునాళ్ల ప్రారంభం

పెదవేగి : పెదవేగిలో వేంచేసియున్న కాలభైరవీ అమ్మవారి తిరునాళ్లు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ తాతా శారద, గౌరవాధ్యక్షుడు రాజులపాటి బాపనయ్య, కమిటీసభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం పోతురాజుబాబు స్వామి, గంగానమ్మ అమ్మవార్లకు 101 బిందెలతో జలాభిషేకం, 101 కొబ్బరికాయలతో నివేదన, అనంతరం కాలభైరవీ అమ్మవారికి అభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం తిరునాళ్లను ప్రారంభించారు. రాత్రి 7 గంటలకు కాసగాని సుబ్బారావు గురువు ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. రాత్రి పది గంటలకు శ్రీలక్ష్మీ తిరుపతమ్మవారి జీవిత చరిత్ర నాటకం ప్రదర్శించారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణంలో పాల్గొన్న దంపతులు

గణపవరం: గణపవరం బొబ్బిలి వంతెన దిగువున ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారి దివ్యకల్యాణం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శ్రీగోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి విశేష పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి స్వామివారి కల్యాణం కనుల పండుగగా నిర్వహించారు. కలిదిండి సూర్యనాగ వెంకట నర్సింహమూర్తి, మేడూరి హేమబ్రహ్మం, మండూరి సత్యనారాయణ దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'గడపగడపకు' వాయిదా

భీమడోలు: సూరప్పగూడెంలో మంగళవారం నిర్వహించాల్సిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం భారీ వర్షాల వల్ల వాయిదా వేసినట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు తెలిపారు.

శ్రమని, శ్రామికుల్ని గౌరవించడంతోనే ప్రగతి



భీమడోలు జంక్షన్‌లో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న ఎస్సై చావా సురేష్‌కుమార్, చిత్రంలో జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు



ఉంగుటూరు సెంటర్లో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వెంకట్రావు



పెదవేగి పామాయిల్ ఫ్యాక్టరీ వద్ద మే డే సందర్భంగా జెండా ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ నేతలు



పెదపాడు మండలంలోని సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే వేడుకలు

భీమడోలు: శ్రమని, శ్రామికుల్ని గౌరవించడం ద్వారా సమాజం ప్రగతిపథంలో పయనిస్తుందని ఎస్సై చావా సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం మేడే సంబరాలు అంబరాన్నింటాయి. గ్రామాల్లో అరుణ పతాకాలు రెపరెపలాడాయి. భీమడోలు జంక్షన్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎస్సై చావా సురేష్‌కుమార్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. శ్రామికుల హక్కుల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ కృషి చేస్తోందన్నారు. ఆర్.లింగరాజు మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ దొంగలకు దేశ సంపదను దోచిపెడుతోందని, శ్రమజీవులను రోజు రోజుకు పేదరికంలోకి నెట్టేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పూళ్లలో బెండి శ్రీను, గుండుగొలనులో బి.రాజమణి, పాతూరులో గడ్డి సూర్యారావుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు ఆయా కార్యక్రమాల్లో సీఐటీయూ మండల అధ్యక్షుడరాలు స్వర్ణకుమారి, కేవీపీఎస్ మండల కన్వీనర్ టి.సుమన్, మండల నాయకులు సాల్మన్‌రాజు, ఎం.ప్రసాద్, జి.మోహన్, అనిల్, నాగయ్య, వివిధ ఫ్యాక్టరీ కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, ఎండీఎం, సివిల్ సప్లాయిస్ హమాలీలు, నాయకులు రమేష్ పి.రాఘవ తదితరులు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన మేడే వేడుకలు

నిడమర్రు: మేడే వేడుకలు మండలంలోని గ్రామ గామానా ఘనంగా నిర్వహించారు. సీపీఎం, సీఐటీయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిడమర్రు, బావాయిపాలెం, బువ్వనపల్లి, పెదనింద్రకొలను, చానమిల్లి గ్రామాల్లో కార్మికులు వేడుకలు నిర్వహించారు. నిడమర్రు ప్రజా సంఘాల భవనం వద్ద పిల్లా హరికుమార్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారపల్లి రమణారావు మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలను ప్రభుత్వాలు రద్దు చేయడాన్ని మేడే స్ఫూర్తితో వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోనశ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, గోక సూరిబాబు, చినిమిల్లి రాంబాబు, దూసనపూడి పాండు, కానూరు శ్రీనివాస్, దేవుని విజయలక్ష్మి, మల్లీశ్వరి తదితరులున్నారు.

సంపద సృష్టికర్తలు కార్మికులే

ఉంగుటూరు: సంపద సృష్టికర్తలు కార్మికులేనని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.వెంకట్రావు అన్నారు. మేడే సందర్భంగా ఉంగుటూరు సెంటర్లో, చేబ్రోలు, కైకరం , గొల్లగూడెం పెదవెల్లమిల్లి నారాయణపురం గ్రామాల్లో మేడే జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్మిక వర్గానికి పెనుప్రమాదం వచ్చిందని వాపోయారు. కార్మికుల హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షులు సీరా అప్పారావు, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు జీవీ కృష్ణారావు, కోర్ని అప్పారావు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నక్కా సుబ్బారావు, ఆటో సంఘం నాయకులు చాలప మడుగు గోపి చంద్, పెదమూర్తి రాజు, టి.శ్రీనివాసు, అనుపోజు వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు. ఉంగుటూరు రైతు బజారు వద్ద కార్పెంటర్స్ అసోషియన్ ఆధ్వర్యంలో మేడే నిర్వహించారు. అసోషియన్ ప్రధాన కార్యదర్శి అను పోజు బ్రహ్మం జెండా ఎగురవేసి మాట్లాడారు.

పెదవేగి పామాయిల్ ఫ్యాక్టరీలో..

పెదవేగి : సమరశీల ఉద్యమాల ద్వారానే కార్మిక హక్కులను కాపాడుకోగలుగుతామని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు కార్మికులకు పిలుపునిచ్చారు. ఏపీ ఆయిల్ ఫెడ్ ప్రాసెసింగ్ యూనిట్ పెదవేగి వద్ద ఇఫ్టూ మేడే జెండా ఆవిష్కరించారు. అంతర్జాతీయ శ్రామిక దీక్షా దినోత్సవం 137వ మేడే సందర్భంగా ఐ.ఎఫ్.టి.యు. ఆధ్వర్యంలో సోమవారం ఫ్యాక్టరీ వద్ద ఉన్న స్థూపానికి హమాలీ కార్మికుడు సంపంగి ప్రసాద్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకటరావు, ఇఫ్ట్ నాయకులు నౌడు నెహ్రూ బాబు, ముక్కు సుబ్బారావు, నాగరాజు, శివ, అప్పారావు,రాజు, నారాయణరావు, శ్రీ హరి, ఈశ్వరరావు, రాజేష్,నరేంద్ర, ప్రసాద్ పాల్గొన్నారు. పెదవేగి మండలం కూచింపూడిలో ఐ.ఎఫ్.టి.యు. అనుబంధ ఏపీ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మేడే స్తూపం వద్ద జెండాను ఆవిష్కరించారు. పెద్దిశెట్టి గంగరాజు, రామాంజనేయులు రవి, గంగిరెడ్డి గంగాధర్, శివ సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్మిక, రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

పెదపాడు: కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను ప్రభుత్వాలు హరించి వేస్తున్నాయని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్ విమర్శించారు. మేడే స్ఫూర్తితో కార్మిక కర్షక ఐక్యతతో హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. సీఐటీయూ సీపీఎం భవన నిర్మాణ కార్మిక సంఘం ఆశ వర్కర్స్ యూనియన్, రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెదపాడులో మేడే కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. స్థానిక నాయుడుగూడెం రోడ్డులో నర్రా ఆంజనేయులు భవనం బస్టాండ్ సెంటర్, వట్లూరు రోడ్, పాలకేంద్రం, గ్రంథాలయం నాయుడుగూడెంలో సీఐటీయూ సీపీఎం జెండాలను ఎగురు వేసారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల అద్యక్షుడు పీ దుర్గ, మండల కార్యదర్శి రెడ్డి లక్ష్మణరావు, రైతు సంఘం మండల అధ్యక్షుడు లింగం కృష్ణారావు, కార్యదర్శి గుండపనేని సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు షేక్ కరీముల్లా వివిధ సంఘాల నాయకులు కార్మికులు స్కీమ్ వర్కర్లు రైతులు పాల్గొన్నారు.

కొవ్వలిలో మేడే వేడుకలు

దెందులూరు: ఆటో డ్రైవర్ల సమగ్ర సంక్షేమ బోర్డును సాధించుకునేందుకు మే డే స్ఫూర్తితో పోరాటానికి సిద్ధం కావాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం కొవ్వలిలో మే డే వేడుకలు ఆటో డ్రైవర్ల కార్యాలయం వద్ద నిర్వహించారు. తొలుత జెండాను నాయకులు జె.గోపి, ఏఐఎల్‌యూ లాయర్ల నాయకులు పట్టా సత్యనారాయణ ఎగురవేశారు. మూళ్ళపూడి వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

పెదపాడు: పూర్వ విద్యావిద్యార్థుల అపూర్వ కలయికకు పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. 2006-07లో పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 16 ఏళ్ల క్రితం 10వ తరగతి చదువుకున్న వారంతా సోమవారం ఒకరినొకరు కలుసుకున్నారు. బాల్య స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. పాఠశాలలో తామంతా కలిసి ఆనాడు చేసిన చిలిపి చేష్టలు, హోమ్ వర్క్ చేయకపోతే ఉపాధ్యాయులు పెట్టిన చీవాట్లు, కొట్టిన దెబ్బలు, మైదానంలో ఆటలాడేటప్పుడు తగిలిన దెబ్బలు, ఆడే తీరు, తోటి విద్యార్థులు నిక్‌నేమ్‌లతో పిలుచుకున్న ఆనాటి మధుర స్మృతులను వారంతా నెమరు వేసుకున్నారు. స్నేహితులంతా ఒకచోటకు చేరుతున్నామనే ఆనందంతో ఉదయం 9గంటలకే పాఠశాలకు చేరుకున్న వారంతా ఎంతో ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకున్నారు. వివిధ వృత్తులలో స్థిరపడినా మేమంతా మీ విద్యార్థులమేనంటూ ఉపాధ్యాయులతో ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలమాలలతో, దుశ్శాలువాలతో విద్యార్థులంతా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జీవీకే చౌదరి, మహమ్మద్ ఆలీ, జీ ప్రసాదరావు, పువ్వుల నాగేంద్రప్రసాద్, గారపాటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

ఉంగుటూరు: తాడేపల్లిగూడెం-నల్లజర్ల రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైక్లిస్టు మృతి చెందాడు. చేబ్రోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెరవలి మండలం ఉసురుమర్రు గ్రామానికి చెందిన బోడ నాగరాజు (35) ఆదివారం దేవరపల్లి మండలం యాదవోలు గ్రామానికి బైక్‌పై సొంత పనిమీద వెళ్లాడు. పని ముగించుకొని అదేరోజు రాత్రి తిరిగి తన గ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో వైఎస్ఆర్ హార్టీకల్చర్ యూనివర్సిటీ ప్రాంతంలో బైక్ అదుపుతప్పి పడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన నాగరాజును తొలుత తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడినుంచి ఏలూరుకు తరలించారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో నాగరాజు మృతిచెందాడు. చేబ్రోలు ఎస్ఐ స్వామి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



స్పందన ఫిర్యాదులపై ఆడిట్ నిర్వహిస్తున్న మండల అధికారులు

పెదవేగి : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసుకొని సత్వరం న్యాయం పొందాలని తహసీల్దార్ ఎన్ నాగరాజు అన్నారు. పెదవేగి మండల తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని అన్ని శాఖల అధికారుల నేతృత్వంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. స్పందన కార్యక్రమంలో గత ఏప్రిల్ 15 నుంచి 30 వరకు నిర్వహించిన స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన 26 ఫిర్యాదులపై సంబంధిత అధికారులు తీసుకున్న చర్యలు, వాటి పరిష్కార ప్రగతిపై అధికారులు వేరిఫికేషన్ (ఆడిట్) చేశారు. అధికారులు రెవెన్యూ శాఖకు వచ్చిన 12 ఫిర్యాదులను, మండల పరిషత్ కార్యాలయానికి సంబంధించి వచ్చిన 6 ఫిర్యాదులు, పోలీస్‌శాఖకు సంబంధించి వచ్చిన 8 ఫిర్యాదుల ప్రగతిపై పరిశీలించినట్టు మండల స్పెషల్ ఆఫీసర్ నాగరాణి, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ రాజ్ మనోజ్ తెలిపారు. వ్యవసాయాధికారి ప్రియాంక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతారత్నం, ఈఓఅండ్‌పీఆర్డీ శ్రీనివాసులు, వెలుగు ఏపీఎం శరత్, హౌసింగ్ ఏఈ నాగరాజు, హెచ్ఓ రత్నమాల పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న కల్యాణం



బువ్వనపల్లిలో బాల వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే వాసుబాబు

నిడమర్రు: నిడమర్రు మండలం బువ్వనపల్లి గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ బాలవెంకటేశ్వరస్వామి వారి వైశాఖ కల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు స్వగ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వాసుబాబు కుటుంబసభ్యులతో పాల్గొని స్వామివారి కల్యాణం తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాలలో చలువ పందిర్లు వేసి, ఆలయాన్ని పూలమాలలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ ఈఓ శోభనాద్రి, ఆలయ అర్చకులు శ్రీనివాసుల సుబ్రహ్మణ్యం, శ్రీనివాసుల రాంబాబు ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అల్లుమోలు ఏసుబాబు, వంగా మధు, తోపు రాము, వానపల్లి వీరయ్య దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, ప్రముఖ దాత సంకు పుల్లయ్యనాయుడు, ఉపసర్పంచ్ వెల్లంకి నరేష్, మండల కాపుసంఘం అధ్యక్షుడు సంకు కొండలరావునాయుడు, రామాలయం చైర్మన్ ఇమ్మిడిశెట్టి కృష్ణమోహన్, పార్టీ గ్రామ అధ్యక్షుడు సంకు శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ అల్లుమోలు ఏసుబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్ షిప్



విద్యార్థులకు ఆర్డరు కాపీ ఇస్తున్న ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు

ఉంగుటూరు: నారాయణపురం అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థులు 28 మందికి సెమిస్టర్ ఇంటర్న్‌షిప్‌లో భాగంగా కోయంబత్తూర్లోని ఆన్సీ సొల్యూషన్స్ లో రూ.15,500, రూ.13,500 స్టైఫండ్ తో ఇంటర్న్‌షిప్ లభించిందని ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు తెలిపారు. సెమిస్టర్ ఇంటర్న్‌షిప్లో విద్యార్థులు కంప్యూటర్ ప్రోగ్రామింగ్, మార్కెటింగ్ సూపర్వైజర్, సేల్స్ మేనేజర్, మొదలైన వివిధ రకాల నైపుణ్యాలను అభ్యసిస్తారని ఇంటర్న్ షిప్ కాలంలో భోజనం, వసతి ఉంటుందన్నారు. సెమిస్టర్ ఇంటర్న్ షిప్ విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థులకు రూ.30 వేలు నుంచి రూ.50 వేల వరకు వివిధ రకాల ఉద్యోగ అవకాశాలను కంపెనీ యాజమాన్యం ఆఫర్ చేయబోతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కొండ రవి, ఇంటర్న్ షిప్ మెంబర్లు తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు నియామక పత్రాలను ప్రిన్సిపాల్ అందజేశారు.

వ్యక్తిపై కేసు నమోదు

పెదపాడు: ఓ వివాహిత పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని గుడిపాడుకి చెందిన జయమంగళ వెంకటేష్ వివాహితను తరచూ వేధిస్తూ అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో వెంకటేష్‌పై సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అకాల వర్షాలతో అన్నదాతల అవస్థ

- సోమవారం భారీ వర్షం
- జనజీవనం అస్తవ్యస్తం
- పల్లపు ప్రాంతాలు జలమయం



గణపవరం ధాన్యం రాశులు పరిశీలిస్తున్న ఏవో ప్రసాద్



వెంకట్రాజపురంలో మంచినీటి చెర్వులోకి మురుగునీరు వెళ్లకుండా అడ్డుకట్ట వేస్తున్న దృశ్యం



గోదావరి కాలువ గట్టుపై ధాన్యం రాశి చుట్టూ నీరు పోయేలా గాడి తవ్వుతున్న రైతు



కాగుపాడు ఆయకట్టులో తడిసిన ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న రైతులు

గణపవరం: అకాల వర్షాలు అన్నదాతలను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. వర్షంబారిన పడకుండా రైతులు ధాన్యాన్ని సంరక్షించుకోవడానికి అనేక పాట్లు పడుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. పల్లపు ప్రాంతాలన్నీ జలమయమై రోడ్లపైకి నీరు, బురద చేరి అడుగు బయటపెట్టలేని విధంగా పరిస్థితి తయారైంది. డ్రైన్లు పొంగి ప్రవహిస్తూ మురుగునీరు రోడ్లపైకి చేరి రోడ్లన్నీ అపరిశుభ్రంగా తయారయ్యాయి. గణపవరం, వెంకట్రాజపురం, పిప్పర, మొయ్యేరు, జల్లికొమ్మరతో పాటు పలుగ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన డ్రైన్లలో పూడిక తొలగింపు పనులు చేపట్టారు. వెంకట్రాజపురంలో రోడ్లపై ప్రవహించే నీరు మంచినీటి చెర్వులోకి వెళ్లడంతో మట్టి, ఇసుక నింపిన బస్తాలను అడ్డుకట్టవేసి నిలువరించారు. డ్రైన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు చేరడంతో నీరు ముందుకు పారక డ్రైన్లు ఎగదన్ని మురుగునీరు రోడ్లపైకి ప్రవహిస్తోంది. ఇక అకాల వర్షాలు రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. మండలంలో 15వేల ఎకరాల్లో రబీ సాగుచేయగా దాదాపు 12వేల ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయి. ఇప్పటివరకూ 8,500 టన్నుల ధ్యానం మిల్లులకు తరలించారు. మిగిలిన ధాన్యం రాసులమీద, బస్తాలు నెట్లుకట్టి ఉన్నాయి. వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ ముందుగానే హెచ్చరించడంతో రైతులు అప్రమత్తమయ్యారు. కోత కోయాలనుకున్న రైతులు వర్షాల కారణంగా తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు. ఇక పుంతగట్లు, పొలాలు, ఖాళీ దిబ్బలపై నిల్వ చేసిన ధాన్యంరాశులు స్వల్పంగా తడిసిపోయాయి. భారీ వర్షం పడటంతో రాశుల అడుగుభాగంలో నీరుచేరి ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో మూడురోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికలతో రైతులు మరింత ఆందోళనకు గురవుతున్నారు. వాతావరణం తెరిపిస్తే రాశుల అడుగున తడిసిన ధాన్యం ఎండ బెట్టుకోవడానికి రైతులు ఎదురుచూస్తుండగా సోమవారం రోజంతా వర్షం జల్లులు కురుస్తూనే ఉన్నాయి. మరో రెండు, మూడురోజులు ముసురు కొనసాగితే తడిసిన ధాన్యం రంగుమారి, ముక్కిపోయి, నాణ్యత దెబ్బతినే అవకాశం ఉంద ని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

ఉప్పుద్రావణం చల్లుకోవాలి

గణపవరం మండలంలో 70శాతం మాసూళ్లు పూర్తయ్యాయని, ధాన్యం రాశులు అక్కడక్కడా తడిసినట్లు గుర్తించామని మండల వ్యవసాయాధికారి యర్రంశెట్టి ప్రసాద్ తెలిపారు. నీరుచేరి రాశుల అడుగుభాగంలో ధాన్యం తడిస్తే వెంటనే ఆ ధాన్యాన్ని తీసి ఆరబెట్టుకోవాలని, ధాన్యంపై 5శాతం ఉప్పు ద్రావణం చల్లుకోవాలని, అలాచేస్తే ధాన్యం మొలకలు రాకుండా, రంగు మారకుండా ఉంటుందని వ్యవసాయాధికారి సూచించారు.

రైతు కుదేలు

భీమడోలు: అకాల వర్షంతో రైతులు కుదేలయ్యారు. సోమవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ఆందోళన చెందారు. కొన్నిరోజులుగా వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు మాసూళ్లు చేసిన ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పుకున్నారు. అయితే వర్షం కురవడంతో రాశుల్లోని అడుగు ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందారు. పల్లపు ప్రాంతాల్లోని ధాన్యం రాశుల చుట్టూ నీరు చేరడంతో వాటిని కిందకు పారేలా గాడులను ఏర్పాటు చేసుకున్నారు. మండల వ్యాప్తంగా 15.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. రబీ సీజన్‌లో మండల వ్యాప్తంగా 13 వేల ఏకరాల్లో 32 వేల మెట్రిక్ టన్నుల దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికి వరకు 21 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి మిల్లులకు పంపారు. మండలంలోని 15 లారీల్లో ధాన్యం మిల్లులకు తరలించామని వ్యవసాయ, రెవెన్యూ అధికారులు తెలిపారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, కురెళ్లగూడెం, పాతూరు, కోడూరుపాడు తదితర గ్రామాల్లోని రోడ్లు, కాలువ గట్లపై ధాన్యాన్ని నెట్లు కట్టారు. పంట నష్టమేమీ లేదని, వర్షం కొనసాగితే నష్టం ఉంటుందని అధికారులు తెలిపారు.

తడిసిన ధాన్యంతో ఇక్కట్లు

ఉంగుటూరు: ఆకాశం కారుమబ్బులు, వర్షంతో తడిచిన ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునేందుకు అన్నదాతల అగచాట్లు పడుతున్నారు. ఉంగుటూరు మండలంలో ఆది, సోమవారాల్లో కురిసిన వర్షానికి ధాన్యం తడిచిముద్దయింది. ధాన్యం ఉత్పత్తుల సకాలంలో ఎత్తే ఏర్పాట్లు ప్రభుత్వం చేయాలని, తడిచిన ధాన్యం కొనుగోలులో మినహాయింపు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.